# వెలుగు నీడలు

*
* *

—రాత్రి...అప్పటికప్పుడే, ఊరంతా...మారాముచేసి చేసి నిద్రాముద్రాంకితుడైన పసివానివలె...మాటుమణిగింది.

అతడు... కథకుడు... ఏకాంతంగా గదిలో బల్లముందు కూర్చుని...రచన ప్రారంభించాడు.

* * *

"....నిశ్శబ్దం....

సద్దు చేయకుండా.... సూరత్ చీరె కుచ్చెళ్ల మెరమెర వినరానీకుండా.... అడుగులో అడుగు వేసుకుంటూ, లోపలికి వెళ్లి.... స్విచ్ వేసింది.

కదలకుండా, దోమతెరమాటున పట్టుదిండ్లలో తల అచ్చుగా దించేసుకుని అతడు నిద్రపోతూ ఉన్నాడు— కొంటెతనానికి నిద్రను అభినయిస్తూన్నాడు.

చిరునవ్వుతో మందంగా మట్టెలు టకటక లాడించింది....! మెలకువ వచ్చినట్టు లేదు.... ఆ అలికిడికి.

సమీపించి, తెరలు తొలగించి మీదకు వాలబోయి.... వెనుకకు తగ్గి మునివ్రేళ్లతో చెక్కలి పుణికింది.

ఉహూ....

—తలవైపున టీపాయ్‌మీది ఫాన్ అర్ధవలయభ్రమణం చేయకుండా, బిగుతుచేసి.... పోయి వాలింది— నిద్రాలోలుపమోహినీవిలాసమోహనాభినయపారవశ్యాన....

'అబ్బ!.... ఏమిటీ.... ఊఁ.... ఎందుకూ? నాకు.... నిద్ర వస్తూంది....'

—పరాకున కనుమూయడంచేత అతడువచ్చి, సరసను కూర్చుని ప్రత్యంగపరామర్శనము తలపెట్టినదాకా.... తెలుసుకోలేదు: ఇక.... నవ్వు.... అణచుకుందామన్నా ఆగడములేదు.... గిలిగింతలలో.

'ఎప్పుడు వచ్చావూ.... నన్ను పిలువలేదేం?'

—బలవంతంగా ముఖం తనవైపు తిప్పకుని....కళ్లలో కళ్లతో.... అతడు ప్రశ్నించడంచేత, వేషం నిలువలేకపోయింది; పెదవులు కదలలేకపోయినా.... కళ్లలో, జవాబు తొణికిపోయినది.

'కాఫీ.... ఇవ్వవూ?'

'తీసుకోండి, ఫ్లాస్కులో ఉన్నదికదూ.... ఓవల్ టైన్!'

'ఊఁ.... నీవు....'

'నేను, లేవలేనమ్మా.... నిన్నరాత్రికూడా....'

'పోనీ— అక్కరలేదులే....'

'మానేయండి.'

'ఆశే!....సరే, మానేస్తే, మరి,.... దానికి బదులు, ఇంకా, ఇం....కా.... తియ్యనిది ఏమైనా....?'

'....అమ్మో....వదలండి; ఉండండి తెచ్చిపెడతాను.... వదలండి బాబోయ్! పన్నుదిగిపోయింది.... అబ్బ!....'

* * *

హఠాత్తుగా...ఏదోదూకిన చప్పుడు: గాజుగ్లాసు ముక్కలై పోతూన్న...గల..గల...కం...గ్...

భావరూపచిత్రశాలలో వన్నెల విన్నాణములు తీరికలు దిద్దుతూవున్న.. అక్షరాల ముత్యాల సరులను కూరుస్తూవున్న... కథకుని హస్తం, కలంతోసహా బ్రేక్ వేసినట్లు ఆగిపోయి, కాగితముల దొంతర మీదనుంచి పక్కకు అంగ వేసింది.

రసభంగమాతుంది, కదలవద్దు ... దేన్నీ లక్ష్యము చేయవద్దు— అన్న అవాక్- హెచ్చరికను...కీళ్లుసడలినా, యోగబలం చేత దేహధారణంచేస్తూ రూపు చెడకుండా నిలుపుకుంటూన్న, స్థవిరాసనము...కిరకిరతో ఆవర్తించింది. విక్రమార్కుడు వచ్చి ప్రాణము పోసి పలికించినా, ఆ పాతకుర్చీమాటను...హిత బోధను ..లెక్కచేసేవాడుకాడు, ఏలాగూను.

—తిరిగి, కారణము ఏమా అని చూశాడు. షెల్ఫుమీద నుంచి దుమికి, ఒలికిపోయిన టీ ని అవలేహనం చేయడానికి పూర్వ రంగముగా శ్మశ్రుసమ్మార్జనము చేసుకుంటూన్న ...మార్జాలరాజు!- చిందరవందరగా శకల రూపాన రూపమేపరి చిరపరిచయవశమున వస్తు నిరూపణమునకు అవకాశ లేశము కలిగించుతూన్న ...గ్లాసు... సాసర్ మాత్ర !

ఆ వేశంతో... ఉద్రేకంతో... లేవబోయినాడు. కుర్చీ చేయి అమరిక తొలగి విడిపోయి ..తూలగొట్టింది. పడకుండా, బల్లను ఊతంగా ఆనుకుని...అదలించబోయి, నిర్వేదము రేకెత్తించిన వేదాంతధోరణిలో 'సర్వమున్ అతని దివ్యకళామయ' మే కదా అని కూర్చున్నాడు. కుదురుకురాని మనసుతో...అభ్యాసయోగమున...కలం చేత అందుకుంటూన్నాడు...

చేతికి ...తడి...

ఏమిటీ—? లేచి, పడబోయి తప్పించుకున్న పాటులో మషీపాత్రి తలక్రిందైనది. సీరా అడుగంట ఒలికిపోయి ..మందగమనముతో, ఏకవాహిని...పాయలౌతూన్నది.

సామాన్యునిలాగా...అధీరునిలాగా...క్రందించ గికురించిన విధాత సర్వయత్నసిద్ధికి న్యక్కారంగా...పక...పక...విరగబడి పోయినాడు.

—నవ్వుతూనే, చేయిజాపి...ఉన్న ఒక్క సిగరెట్‌నూ అందుకుని...కృపీటయోనిపేటికాభావంచేత లాంతరునొక్కి, ముట్టించి,...మళ్లీ కల్పనా సమాధిలోకి వెళ్లిపోయినాడు.

* * *

'....ముసిరిన తుమ్మెదలను విదలించేలాగు... సజీవ పద్మినిగా...ఆ అమ్మాయి, మొగమాటము ప్రసన్నమౌతూన్న బలవంతముతో, తప్పించుకుని .. లేచికూర్చుని... చూసి సిగ్గుపడుతూ, ముఖం అటు తిప్పకుని... మళ్లాచూసి, మనసు నిలుపలేక, ఆతని మీదకు వ్రాలి, కౌగిలిలో అణగి పోతూ, తొలగినపైట వదలకుండా పెనగులాడుతూ... 'వదలంబారిన నీవిపట్టుకుని'... సోఫామీదనుంచి...తివాసీ మీద, దొరలిపోయి...

...తప్పించుకుని... లేచి అందకుండా వెళ్లి... లైట్ స్విచ్చాఫ్ చేసి,—'

* * *

—ఒలికిన సీరా పాళీతో దోవుతూ...కథను దీక్షతో నడుపుతూన్నాడు.

మంగాధిక్యాలను ధిక్కరించే జ్ఞానజ్యోతి...మార్పును మొదట అభిజ్ఞాతము కానీయలేదు : క్షీణించి...రవలు ఎగిరించి, కొనలుసాచి...శబ్దించి, ఎక్కిళ్లతో ,.. స్నేహదారిద్ర్యాన దీపం కొండ ఎక్కింది !

నిస్పృహతో కలం అలా జారవిడిచి...తలుపు తీసికొని వీధులోకి వచ్చి నిలుచున్నాడు:— నిర్మానుష్యం... !

'సమయమిదే... రారసామి
తామసించకురా...'

—ఆలకించి, తలఎత్తి చూశాడు. పక్కమేడమీదనుంచి ఫోన్ వినబడుతూన్నది. దీపము వెలుగున...అద్దాల కిటికీ తలుపు మీద...చుంబనోన్ముఖులైన దంపతుల ఛాయామూర్తులు అవతరించి, కార్యావసానమున విడిపోయినవి. పోర్టికోలోకి...సిగరెట్ ఊదేయడంకోసం ఆతడు వచ్చి—

—అనుకరణ మర్యాదను...కథకునికి...జేబులోకి చేయి పోతుండగా, శూన్యస్థితి జ్ఞాపకము వచ్చి...తెచ్చుకుందామని బయలుదేరినాడు.

దూరాన ఒక బంక్ తీసిఉన్నది. ఉత్సాహంతో అందాకా నడచిపోయి...అవసరం...ప్రస్తుతమూ గనుక అప్పుడు మెలకువ తెప్పించుకున్నాడు. జేబు అప్పటికి ఎన్నాళ్లనుంచో ఖాళీ...! కానీ లేదు . యిటా, బైటాను!...దుకాణదారు అపరిచితుడు. అప్పుపెట్టడం...?తిరిగి యింటివైపు...

'ఏమి...కావాలి, బాబూ...? రండి, వచ్చి ఆలాగ వెళ్లిపోతున్నారేం?'

జవాబుచెప్పక పోవడం భావ్యమా? ఏమీ అక్కర లేదంటే...ఆతడు ఏమనుకుంటాడు...? ఎందుకు...దగ్గరకువచ్చి వెనుకకు తగ్గిపోతున్నాడనుకుంటాడో?...

'చాకలెట్సు...ఏమైనా ఉన్నవా?'

...ఉండవని రూఢిగా నమ్మకము గనుక ధైర్యంగా...కొనేవాడి లాగానే అడిగాడు.

'అం...దయ చేయండి...'

చిక్కులో పడ్డాడు. అయినా...అంతకు పై ఎత్తు చేతకాదు గనుకనా...ఫరవా లేదు...

'...ఏవీ, చూపించు.—ఉహూం...ఇవి కావు, లంధారి యో కంపెనీవి...'—ఉం టే...అప్పుడు మహా కొనేసే వాడిలాగానే...!

'లేవండీ, అయ్యా...! ఇక్కడ రోజూ ఖర్చు కావు. తమ లాటివారు...రోజూ పుచ్చుకుంటామంటే...తెస్తాను. ఇవి చూశారా అండి...కొత్త రకం ...ఇవాళే యిచ్చిపోయినాడు దొర, సాంపిల్ గా. కాల్చిచూడండి ...! ఒకటి ... తీసుకోండీ ... మాకు పోయేది ఏమున్నదీ...? మీరు నాణెం చేయాలి కాని...మాకేం తెలుస్తుంది...?

బలవంతం రవంత చేయించుకుని...వాడిని అనుగ్రహిస్తూన్నట్టుగా...అందుకున్నాడు. నిజానికి మరో అప్పుడు...పరిహరణీయమైనా...ఎంతో ఆప్యాయంగా, వరప్రసాదంలా...ఈషత్తైనా మిగల్చకుండా ఆఖరు చేసి...మెలుకువతో—

'ఏం అంత బాగుండ లేదయ్యా...! చౌకరకం...టొబాకో మంచిది గాదు...'—అని, నడుస్తూనే సమాధానం విసిరి...దుకాణదారు మాట వినిపించుకోకుండా, వెనుదిరిగి చూడకుండా...అంగలు పెద్దవి వేస్తూ వెళ్లిపోయినాడు.

ఇంటికి జేరి...లోపలికి పోబోతూండగా పక్క మేడమీద నుంచి...ఇంకా, కిల...కిల...

—తెల్లవారింది—కథకుడు కనుమూయకుండానే... !...దినమణి కరావలంబనముతో...దీపిక అధికారం...తాత్కాలికమే అయినా...సమసిపోయినది. వ్యగ్రోత్సాహముతో...కలంపట్టి...బల్లమీద...ఆరక నిలిచిపోయి...దయ దలచిన...సీరాతో—

...కథను మరోమారు చదివి...విడిచివేసిన చోటనుంచి మొదలువేసి...అహమహమిక, తదధీనవృత్తులు...ప్రణయ కల్పనలలో పొదివిపట్టి ... ఆవరించుకుని వేధించకుండా ... నిగ్రహించాడు. కథకుని...కష్టభాక్కాయ స్మృతి కాదు...స్పందించు నది...కావ్యాత్మ...!

'సార్...అయ్యా...పంతులుగారూ...'

'ఎవరు?'

'నేనండీ...'

'అంటే...'

'నేను...నేనేనండీ...'

'ఎవరో...లోపలికి రావచ్చును. ఏం...రంగనాథా...ఉదయమే వచ్చావు...?'

'...పంపారండీ...'

'అలాగా...! ఇంకా డబ్బురాలేదు. చూసి, ఒకటి రెండు రోజుల్లో...'

'మీరు...ఇలాగే వాయిదాలు...వేస్తున్నారు... ఘట్టిగా అడగమన్నారండీ...'

'చెప్పడం లేదోయ్...యిప్పుడు లాభం లేదని...రావాలి, రేపో మాపో...'

'ఇప్పుడు...ఏలాగండీ...? వట్టి చేతులతో తిరిగి వెళితే...యజమాని ఊరుకోడు...'

'నేను...వస్తాను కాదూ...'

'చెప్పినా వినరండీ...రేగిపోతున్నాడు.'

'ఒకగంటలో వస్తాను...పద. ఏదితప్పినా...కాఫీ వస్తు... కూడదు కాదూ...'

'మీ యిష్టం. పోనీ, కొంత అయినా ఇచ్చేదాకా... రామోకండి. మీవంటి వారిని...ఏమన్నా అంటే మాకు...వినడానికి కష్టమౌతుంది...'

'ఏమీ లేదు... నేను వస్తాను లే...'

'సరి...ఉంటాను సార్...'

—నిజమే...! ఎందుకు నిష్ఠురమాడించుకోవాలి? కాఫీ లేకపోతే... భోజనం లేకపోతేమాత్రం... రేపూమాపూ గడవదంటవా...? కాలగమనాన్ని...కడుపు హెచ్చరికను...తొందరను...మరిపించడానికి...కలం లేదూ...?కల్పనానిధులు లేవూ...?

—ఆ మాటే...మరచిపోయి...మళ్లా కథ...!

* *
*